

## డిజిటల్ వరల్డ్ స్తంభన

- యూట్యూబ్, 'ఎక్స్'లో భారీ అంతరాయం!
- చరిత్రలోనే అతిపెద్ద 'ఔటేజ్'..
- ఉక్కిరిబిక్కిరైన నెటిజన్లు

02

## మహిళలకు ఆర్టీసీ స్మార్ట్ కార్డులు

- వచ్చే నెల నుంచి పంపిణీ
- నకిలీ ఆధార్ కార్డు బెడదకు చెక్
- మహాలక్ష్మి పథకంలో కొత్త సంస్కరణ

02




సంపుటి :02 | సంచిక :310 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

బుధవారం 18, ఫిబ్రవరి 2026



### సూపరింటెండెంట్ గా వస్తా..
## ఉద్యోగాలు ఇస్తా!

- నిరుద్యోగుల నుంచి దండిగా వసూలు
- పరకాల ప్రభుత్వ ఆసుపత్రి పేరిట 'జాబుల' మోసం ..

03



# కాంగ్రెస్.. జోష్

## ఉమ్మడి జిల్లాలో తిరుగులేని విజయం

- 12కు 12 బల్దియాలు హస్తగతం
- ఎమ్మెల్యేల వ్యూహ ఫలితం
- పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం
- ఇదే ఒరవడిలో ప్రాదేశిక ఎన్నికల్లో గెలుపునకు అడుగులు

02

**అక్షరదర్బార్, వరంగల్ :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి పట్టు నిలుపుకున్నది. పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, ములుగు వంటి పట్టణాల్లో హస్తం పార్టీ విజయఢంకా మోగించింది. ఈ గెలుపుతో జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటికే పైచేయి సాధించిన పార్టీ ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ తన హవా చాటడం విశేషం. రాబోయే ప్రాదేశిక (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల్లో కూడా ఇదే ఒరవడి కొనసాగించేందుకు నాయకులు సన్నద్ధమవుతున్నారు.



### 21 వరకు విగ్రహ
## పునః ప్రతిష్ఠ

- 26 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు
- 21న కొడవటంచకు చిన్న జీయర్ స్వామి, స్పీకర్, మంత్రుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేయాలి:
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

05


### 12 ఆర్డీఎక్స్
## బాంబులు పేల్చేస్తాం

**శ్రీలంక తరహాలో ఆత్మాహుతికి పాల్పడతాం..**

- తెలుగు రాష్ట్రాల్లోని కోర్టులకు బాంబు బెదిరింపులు
- ఈమెయిల్ ద్వారా సందేశం పంపిన దుండగులు
- కోర్టుల నుంచి భయంతో జడ్జీలు, అడ్వొకేట్ల పరుగులు

05






# కాంగ్రెస్ జోష్

- ఉమ్మడి జిల్లాలో తిరుగులేని విజయం
- 12కు 12 బల్దియాలు హస్తగతం
- ఎమ్మెల్యేల వ్యూహ ఫలితం
- పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం
- ఇదే ఒరవడిలో ప్రాదేశిక ఎన్నికల్లో గెలుపునకు అడుగులు

అక్షరదర్బార్, వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి పట్టు నిలుపుకున్నది. పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, ములుగు వంటి పట్టణాల్లో హస్తం పార్టీ విజయఢంకా మోగించింది. ఈ గెలుపుతో జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటికే పైచేయి సాధించిన పార్టీ ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ తన హవా చాటడం విశేషం. రాబోయే ప్రాదేశిక (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల్లో కూడా ఇదే ఒరవడి కొనసాగించే దుకు నాయకులు సన్నద్ధమవుతున్నారు.

**- కలిసి వచ్చిన లక్కీ డ్రా**

మున్సిపల్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. మెజారిటీ స్థానాల్లో స్వతంత్రులను తమ వైపు తిప్పుకోవడంలో ఎమ్మెల్యేలు సఫలమయ్యారు. పార్టీ సీనియర్ల సలహాలతో అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లారు. తొర్రూరు, జనగామ వంటి చోట్ల తీవ్ర పోటీ ఉన్న ప్పటికీ లక్కీ డిప్ ద్వారా విజయం సాధించి చైర్మన్ పీఠాలను కైవసం చేసుకున్నారు. ఏకాభిప్రాయం కుదరని చోట ఎమ్మెల్యేలే చొరవ తీసుకుని అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చారు. చివరకు మొత్తం 12 మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకుని కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది.

**- ఎమ్మెల్యేల శ్రమ ప్రశంసనీయం**

కాంగ్రెస్ విజయానికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల శ్రమ ప్రధాన కారణమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ భుక్యా అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమ ప్రాంతాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తొర్రూరులో చక్రం తిప్పారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, ములుగు ఎమ్మెల్యే సీతక్క తమ పరి ధిలోని మున్సిపాలిటీల్లో గెలుపు బాధ్యతలను భుజాన వేసు కున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వార్డుల వారీగా ప్రచారం నిర్వహించారు.

**- మందలింపుతో..**

పంచాయతీ ఎన్నికల్లో కొంతమంది ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయి లోకి వెళ్లడం లేదని కాంగ్రెస్ నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరా జన్ సైతం చురుగ్గా ఉండాలని ఎమ్మెల్యేలను హెచ్చరించిన నేపథ్యంలో ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నేతలు వేసిన ఎత్తుగడ లను సమర్థవంతంగా చిత్తు చేస్తూ ఓటర్లను ఆకట్టుకు న్నారు. తమపై అధిష్ఠానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ మున్సిపాలిటీల్లో పార్టీ జెండా ఎగిరేలా గట్టి పట్టుదల ప్రదర్శించారు.

## డిజిటల్ వరల్డ్ స్తంభన

- యూట్యూబ్, 'ఎక్స్'లో భారీ అంతరాయం!
- చరిత్రలోనే అతిపెద్ద 'ఔటేజ్'..
- ఉక్కిరిబిక్కిరైన నెటిజన్లు

అక్షర దర్బార్, ప్రధాన ప్రతినిధి : ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజాలు యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) లలో తలెత్తిన సాంకేతిక లోపాలు ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లను తీవ్ర ఇబ్బందులకు గురిచే శాయి. ఫిబ్రవరి 17 సాయంత్రం యూట్యూబ్ చరిత్రలోనే అతిపెద్ద సేవ నిలిపివేత (ఔటేజ్) నమోదైంది. యూట్యూబ్ యాప్ లేదా వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే 'Something went wrong' అనే సందేశం రావడంతో పాటు, వీడియోలు ప్లే కాకపోవడం, హోమ్ పేజీ లోడ్ అవ్వకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. డౌన్ డిటెక్టర్ నివేదిక ప్రకారం.. కేవలం అమెరికాలోనే దాదాపు 3.2 లక్షల మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఇండియా, యూకే, కెనడా, బ్రెజిల్ వంటి దేశాల్లోనూ యూట్యూబ్ టీవీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనికి ఒకరోజు ముందే (ఫిబ్ర వరి 16న) 'ఎక్స్' కూడా సుమారు రెండు గంటల పాటు మొరా యించింది. ఫీడ్ రిఫ్రెష్ కాకపోవడం, లాగిన్ సమస్యలతో దాదాపు 40 వేల మంది ఫిర్యాదు చేశారు. ఇంత పెద్ద ఎత్తున సేవలు నిలిచి పోవడానికి గల స్పష్టమైన కారణాలను కంపెనీలు వెల్లడించలేదు. సమస్యను విశ్లేషిస్తున్నామని మాత్రమే యూట్యూబ్ స్పష్టం చేసింది. గంటల పాటు సాగిన ఈ 'డిజిటల్ బ్లాక్ అవుట్' వినియోగదారు లను ఆందోళనకు గురిచేసింది.

## రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు

- ముగియనున్న సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ పదవీకాలం
- ఈనెల 26 నోటిఫికేషన్, మార్చి 16న పోలింగ్

అక్షరదర్బార్, హైదరాబాద్ : దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న 37 మంది సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఖాళీ కాబోతున్న స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నగారా మోగించింది. తెలం గాణలో ప్రస్తుత రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీ పదవీకాలం కూడా ముగియనుంది. ఈరెండుస్థానాలకు ఎన్నిక జరగాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 26న ఈ ఎన్నికలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ వెలువడనుంది. మార్చి 5వ తేదీ వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చు. మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

### ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో
## తాడిచెర్ల విద్యార్థుల ప్రతిభ

అక్షర దర్బార్ మల్హర్: తాడిచెర్ల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో తాడిచెర్ల విద్యార్థులు సత్తా చాటారు. కాటారం డివిజనల్ ఇంచార్జ్ వి.కుమారస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో తాడిచెర్ల హైస్కూల్‌కు చెందిన బి.సిరి చందన (ప్రథమ), యమ్ డి.శైలాని (ద్వితీయ), పి.వర్షిని (తృతీయ) స్థానాలు సాధించి, ఈ7 నెల 21న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.




## మహిళలకు ఆర్టీసీ స్మార్ట్ కార్డులు

- వచ్చే నెల నుంచి పంపిణీ
- నకిలీ ఆధార్ కార్డు బెడదకు చెక్
- మహాలక్ష్మి పథకంలో కొత్త సంస్కరణ

అక్షరదర్బార్, హనుమకొండ : రాష్ట్రంలో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి మహిళలకు స్మార్ట్ కార్డు జారీ చేసేందుకు ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. వచ్చే నెల నుంచి స్మార్ట్ కార్డులు ఇవ్వబోతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. తాజాగా ఓ మీడియా చానల్తో మాట్లాడిన ఆయన.. ఇతర రాష్ట్రానికి చెందిన మహిళలు తెలంగాణ అడ్రస్‌తో ఫేక్ ఆధార్ కార్డులను తయారు చేసుకుని ఈ పథకం కింద ప్రయాణి స్తున్నారని, దీన్ని చెక్ పెట్టేందుకు త్వరలోనే స్మార్ట్ కార్డులను తీసు కువస్తున్నామన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డు నమూనాగా మూడు డిజైన్లు సిద్ధం చేశామని, వీటిలో నుంచి ఒకదాన్ని ప్రభుత్వం ఫైనల్ చేయనుందని చెప్పారు. స్మార్ట్ కార్డులు వచ్చాక టికెట్ జారీ చేయడం కూడా మరింత సులభం అవుతుందన్నారు. అలాగే వేసవి సెలవుల దృష్ట్యా వచ్చే మార్చి 1 నుంచి ఏసీ, మిగతా లగ్జరీ బస్సుల్లో డిస్కౌంట్ ఇవ్వబోతున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. వీటిల్లో టికెట్ ధరలు ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరలతో సమానంగా తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. పొల్యూషన్ నియంత్రించే భాగంగా ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రికల్ బస్సులే నడ పాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. పీఎంఈ డ్రైవ్ కింద త్వరలో రాష్ట్రానికి 2,000 బస్సులు రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు.

## డిజిటల్ బోధనతో మెరుగైన ఫలితాలు

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- ఏఐ, డిజిటల్ తరగతులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



అక్షర దర్బార్ , మహబూబాబాద్: నూతన టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మరియు డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. బుధవారం ఆయన మహబూబాబాద్ మండలం పర్వతగిరి, కురవి మండలం నేరేడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యా ప్రమాణా లను స్వయంగా పరిశీలించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపా ధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని ఆదేశించారు. పాఠశా లల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. అనంతరం కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థు లకు నాణ్యమైన డైట్ మెనూ అమలు చేయాలని అధి కారులను ఆదేశించారు. హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ అంశాలపై పిల్లలకు అవగాహన కల్పిం చాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల్లో విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# సూపరింటెండెంట్ గా వస్తా..
# ఉద్యోగాలు ఇస్తా!

- నిరుద్యోగుల నుంచి దండిగా వసూలు
- పరకాల ప్రభుత్వ ఆసుపత్రి పేరిట 'జాబుల' మోసం ..

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్యోగాల ఆశతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణానికి చెందిన ఓ డిప్యూటీ సివిల్ సర్జన్ తాను త్వరలోనే ఆ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా వస్తానని ప్రచారం చేసుకుంటూ.. ఈ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారం పట్టణంలో దుమారం రేపుతోంది.



### - నిరుద్యోగులకు వల..

పరకాల పరిసర ప్రాంతాల నిరుద్యోగులు కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితిని గమనించిన ఆ వైద్యుడు వారి ఆశలను వలగా మార్చుకున్నాడని ప్రచారం. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి నగదు తీసుకుంటున్నట్లు ప్రచారం సాగుతుంది.

### నియామకం కాకముందే వసూళ్లు

గతంలో హనుమకొండ జిల్లా పరిధిలోని కొన్ని మండలాల్లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేసిన అనుభవాన్ని చూపిస్తూ తాను త్వరలోనే పరకాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియామకం అవుతానని చెప్పి ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఏఎన్ఎమ్‌లు, డ్రైవర్ ఉద్యోగాల హామీ ఇస్తూ డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది.

### - ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి లక్ష

ఇప్పటివరకు 10–15 మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. "ఉద్యోగం వచ్చాక మిగతా మొత్తం తీసుకుంటా" అంటూ హామీ ఇస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇచ్చిన వారు ఇతరులకు తెలియజేయడంతో ఇంకా వసూళ్లు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సూపరింటెండెంట్ నియామకంపై సందిగ్ధం

ఆ వైద్యుడు నిజంగా పరకాలకు సూపరింటెం డెంట్‌గా వస్తాడా లేదా అన్నది స్పష్టత లేదు. అయినప్పటికీ పోస్టింగ్ రాకముందే ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## జనన, మరణ నమోదుకు కొత్త రూల్స్

- 21 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఆలస్యమైతే జరిమానా బాదుడు
- వైద్యారోగ్య శాఖ కీలక ఉత్తర్వులు

అక్షర దర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో జనన, మరణాల నమోదు ప్రక్రియను ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. ఇకపై జననం లేదా మరణం సంభవించిన 21 రోజుల్లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవడాన్ని తప్పనిసరి చేస్తూ వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గడువు దాటితే జరిమానాలు చెల్లించక తప్పదు.

### కొత్త నిబంధనలు ఇవే:

**21 - 30 రోజుల్లోపు:** ఈ గడువులోగా నమోదు చేస్తే రూ. 25 అపరాధ రుసుము చెల్లించాలి.
**నెల దాటితే:** 30 రోజుల నుంచి ఏడాది లోపు నమోదు చేయాలంటే జిల్లా రిజిస్ట్రార్ అనుమతితో పాటు రూ. 250 జరిమానా కట్టాలి.
**పేరు నమోదు:** బిడ్డ పుట్టినప్పుడు పేరు నమోదు చేయకపోతే, ఏడాది లోపు ఉచితంగా పేరును చేర్చుకునే అవకాశం కల్పించారు.
ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు రికార్డులు పక్కాగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట గ్రామానికి చెందిన మేరగుత్తి కిరణ్ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న శాయంపేట గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్ దశదిన కార్యక్రమానికి 5 వేల రూపాయలు కిరణ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు కిరణ్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.వారి వెంట 12 వార్డు సభ్యుడు దైనంపల్లి సుమన్,గట్టు శ్రీనివాస్ ఉన్నారు.

## ప్రకటన

**నేను ఈర్ల రణధీర్, తండ్రి పేరు అశోక్, వయస్సు 27 సంవత్సరాలు, నివాసం: నాగారం గ్రామం, మండలం: పరకాల, జిల్లా: హనుమకొండ. 26-02-2026 తేదీన మా ఇంటిని సర్దుతున్న సమయంలో నా విద్యా సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు (ప్రొవిజనల్ మరియు ఇతర సర్టిఫికెట్లు) కనిపించకుండా పోయినవి. వాటిని ఎంతో వెతికినా దొరకలేదు. అవి నా భవిష్యత్తు అవసరాల కోసం అత్యంత ముఖ్యమైనవిగా ఉండగా, ఎవరికైనా అవి దొరికిన పక్షంలో క్రింది చిరునామా లేదా ఫోన్ నంబర్ కు సమాచారం ఇవ్వవలసిందిగా ప్రార్థన.**

ధన్యవాదాలు.
ఈర్ల రణధీర్
మొబైల్: 9618776383
చిరునామా: నాగారం గ్రామం, పరకాల మండలం, హనుమకొండ జిల్లా.

## నివాళి..



అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో నర్ర మల్లయ్య అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న సర్పంచ్ స్వాతి శ్రావణ్ కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్ర రాజు ప్రధాన కార్యదర్శి ఉదర మహేష్ ఉపసర్పంచ్ కలువాల నరేందర్ మండల ఉపాధ్యక్షులు సౌల కిష్టయ్య ,ఆకుల లక్ష్మణ్, పంచగిరి సురేందర్, అడప మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ నిందితుడి మృతి

- నిన్న ప్రియురాలిపై పెట్రోల్ పోసి, తానూ కాల్చుకున్న వ్యక్తి ఇతడే
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

అక్షరదర్బార్, మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లో వివాహితపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ దాడికి పాల్పడి, తాను కూడా నిప్పంటించుకున్న నిందితుడు అంజయ్య బుధవారం ప్రాణాలు కోల్పోయాడు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కురవి మండలం మోదుగులగూడెం గ్రామానికి చెందిన అంజయ్యకు, పద్మ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. పద్మ మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందన్న అనుమానంతో అంజయ్య ఆమెపై కక్ష పెంచుకున్నాడు. మంగళవారం ఆమె తన తల్లిగారి ఇంటికి వచ్చిన సమయంలో అంజయ్య అక్కడికి వెళ్ళాడు. తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పంటించాడు. అదే క్రమంలో తనపై కూడా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అంజయ్య బుధవారం మరణించాడు. బాధితురాలు పద్మ ప్రస్తుతం ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.

# గుండెను చీల్చిన గుడుంబా

- గుడుంబా బారిన పడి ఇద్దరి మృతి
- అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం
- కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్న యువత

అక్షర దర్బార్ శాయంపేట : ఓవైపు మాదకద్రవ్యాల మత్తు నుంచి యువతను దూరం చేసే ప్రయత్నాల్లో పోలీసులు తలమునకలై ఉంటే.. కొందరు గుట్టుగా నాటు సారాకు తయారు చేస్తున్నారు.ప్రమాదకర రీతుల్లో సారాను ఉత్పత్తి చేస్తూ సామాన్యుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలో గుడుంబా మత్తు మృత్యువుకు దారి తీస్తోంది.గ్రామంలో అక్రమంగా సాగుతున్న గుడుంబా తయారీ, విక్రయాలతో ఇద్దరు వ్యక్తులు తాజాగా మృతి చెందగా, గతంలో చాలామంది మృతి చెందిగా మరికొందరు అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం.దీంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.గ్రామంలోని పెద్దకోడెపాక,జోగంపల్లి తదితర గ్రామాలలో గుడుంబా



కేంద్రాలు నిరభ్యంతరంగా కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.యువకులు, వృద్ధులు, మహిళలు సైతం గుడుంబాకు బానిసలై ఆరోగ్యాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో కూడా ఇలాంటి మరణాలు సంభవించినా అధికారులు పట్టించుకోలేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.

### "మాకు అధికారుల అండ ఉంది"

గుడుంబా నిర్వాహకులు "అధికారులకు మాతో సంబంధాలున్నాయి.మా జోలికి ఎవరూ రారు" అంటూ బహిరంగంగా చెప్పుకుంటున్నారని గ్రామ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తుంది.దీనిపై గ్రామంలో చర్చ సాగుతోంది.

### చర్యలు లేకపోతే మరిన్ని ప్రాణ నష్టాలు

ఒకే వారంలో ఇద్దరు మృతి చెందడం కలకలం రేపింది.ఇంకా కొందరు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.గుడుంబా నిర్మూలనపై తక్షణ చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రాణ నష్టాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### కలెక్టర్ కు ఫిర్యాదు సిద్ధం

ఎక్సైజ్, పోలీస్ శాఖలు వెంటనే దాడులు నిర్వహించి గుడుంబా కేంద్రాలను మూసివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు సామూహిక ఫిర్యాదు చేయాలని గ్రామ యువత నిర్ణయించినట్లు తెలిసింది.గ్రామంలో అక్రమ మద్యం నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



# పెద్దాపూర్ హై స్కూల్ లో షీటీం అవగాహన

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు షీ టీం భరోసా సంయుక్తంగా పెద్దాపూర్ హై స్కూల్ లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ మాట్లాడుతూ.. గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు అపరిచితుల ఫోన్ లేదా వీడియో కాల్స్ కు స్పందించవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని,చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు షీ టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎవరికైనా అసభ్య ప్రవర్తన ఎదురైతే ధైర్యంగా 8712658162కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి, ఘటనలు జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అన్నారు.



# ఆజంనగర్ పీహెచ్ సీకి తాళం వేసిన గ్రామస్తులు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఆస్పత్రి వైద్యుడు సమయపాలన పాటించడం లేదని ఆరోపిస్తూ భూపాలపల్లి మండలం ఆజంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆజంనగర్ గ్రామస్తులు బుధవారము తాళం వేసి నిరసన తెలిపారు గ్రామస్తుల కథనం ప్రకారం ఆజంనగర్ హైస్కూల్లో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు భూపాలపల్లి నుండి ఆటోలో ఆజంనగర్ కు విధుల నిమిత్తం బుధవారం ఉదయము వెళుతున్న సమయంలో ఆటో ఆదుపుతప్పి బొల్తా కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరు టీచర్లకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆజంనగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళగా సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండి ప్రధమ చికిత్స చేశారు. ఆ సమయంలో వైద్యులు లేకపోవడంతో ఈ విషయం తెలుసుకున్న ఆజంనగర్ గ్రామస్తులు పీహెచ్ సీ వద్దకు వచ్చి ఆసుపత్రికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ తాను పర్యవేక్షణ నిమిత్తం వేరే హెల్త్ సబ్ సెంటర్ కు వెళ్లానని పేర్కొన్నారు.

# రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- ప్రమాదకరంగా ఇనుగుర్తి – చిన్న ముప్పారం రహదారి
- భారీ వర్షాలకు కోతకు గురై పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు
- అడుగు తీసి అడుగు వేయాలంటేనే వణుకుతున్న జనం
- నరకప్రాయంగా మారిన రాకపోకలు
- పట్టించుకోని పాలకులు, సంబంధిత అధికారులు



అక్షర దర్బార్, ఇనుగుర్తి: మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గమైన ఇనుగుర్తి–చిన్న ముప్పారం రహదారి ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారింది. వందలాది మంది ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, తండాలవాసులు నిత్యం ప్రయాణించే ఈ దారిని చూస్తే 'ఇది రహదారా లేక మృత్యుమార్గమా?' అనే సందేహం కలగక మానదు. రోడ్డుకు ఇరువైపులా భారీగా కోతకు గురై, ఎప్పుడు ఏ వాహనం బోల్తా పడుతుందో తెలియని దయనీయ పరిస్థితి నెలకొంది. పెద్ద పెద్ద గుంతలతో రోడ్డులో సగం భాగం పూర్తిగా ధ్వంసమై, ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. సింగిల్ రోడ్డుపై నాణ్యతా లోపాలతో వేసిన తారు, గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మరింతగా దెబ్బతిన్నది. రోడ్డు కింద మట్టి కొట్టుకుపోయి, తారు గాలిలో తేలుతున్నట్టుగా కనిపిస్తోంది. చిన్నముప్పారం రైతులు తమ పంటలను మిల్లులు, మార్కెట్లకు తరలించేందుకు ఇదే ప్రధాన దారి. భారీ లోడుతో ట్రాక్టర్లు ఈ రోడ్డుపై వెళ్లడం అత్యంత సాహసంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలు, రోగులను ఆసుపత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్ కూడా రాలేని స్థితి నెలకొంది. సమయానికి వైద్యం అందక ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.
అదేవిధంగా మండల కేంద్రం నుంచి కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్, ఇతర పాఠశాలలు, గురుకులాలకెళ్లే విద్యార్థులు, తల్లిదండ్రులు నిత్యం ఇదే దారిలో ప్రయాణించాల్సి వస్తోంది. పిల్లలు క్షేమంగా తిరిగివచ్చేవరకు తల్లిదండ్రులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే గ్రామస్తులంతా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, అవసరమైతే మండల కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

## నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేయాలి

**: కారుపోతుల సుమన్ గౌడ్, బీఆర్ఎస్ నేత**



ఇనుగుర్తి మండల కేంద్రానికి మా గ్రామం నుండి వెళ్ళడానికి ప్రధాన మార్గం ఇదే.. కానీ ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే భయానకంగా ఉంది. తక్షణమే ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలి. కేవలం మరమ్మతులతో సరిపెట్టకుండా, రోడ్డును విస్తరించి సౌకర్యవంతమైన నూతన బి.టి.రోడ్డును నిర్మించాలి. పెద్ద ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించక ముందే పాలకులు మేల్కోవాలి. వర్షాకాలం రాకముందే అప్రమత్తం కావాలి..

# ఎన్‌హెచ్ పక్కన 11 కేవీ లైన్

- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- లైన్ ను అక్కడి నుంచి మార్చాలని వేడుకోలు



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం మాందారిపేట గ్రామంలో జాతీయ రహదారి పక్కన ప్రతిపాదించిన కొత్త 11 కేవీ విద్యుత్ లైన్‌పై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైన్ వేస్తే విద్యుత్ స్తంభాలను వాహనాలు ఢీకొంటే ప్రమాదం సంభవిస్తుందని భయపడుతున్నారు. పాత లైన్ సమస్యల నేపథ్యంలో కొంతమంది వద్ద నుంచి డబ్బులు తీసుకుని కొత్త లైన్ వేస్తున్నారని వారు ఆరోపించారు. జాతీయ రహదారి పక్కన 11 కేవీ లైన్ రాకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై పరమేశ్వర్ విద్యుత్ అధికారులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని కాలనీవాసుల అభ్యంతరాలు తెలుసుకున్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పెద్దకొడేపాక గ్రామానికి చెందిన కోగిల సదానందం ఇటీవల మరణించగా, ఆయన కుటుంబానికి కోగిల బ్రదర్స్, ఏపీఆర్ సేన సభ్యులు కోగిల శివ, రాము ఆధ్వర్యంలో రూ.10వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మహేశ్వరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూప మాట్లాడుతూ.. విద్యార్థులు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పిల్లలు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. నర్సంపేట మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రామానంద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎల్లవేళలా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంధం నరేందర్, కౌన్సిలర్లు బుస శిరీష రాజు, భూక్య మాత్రు రాథోడ్, ఏపూరి శ్రీనివాసరెడ్డి, మాదాసి రవి, లయన్స్ క్లబ్ సెక్రటరీ ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి ఎండీ యాకూబ్, గీతాంజలి ఫౌండర్ శ్రీ సుబ్బారెడ్డి, కాకతీయ గురుకుల ఫౌండర్ కమలాకర్, రాజిరెడ్డి, కాకతీయ ప్రిన్సిపాల్ మాధవ రెడ్డి, ఉపాధ్యాయులు అర్జునసాగర్, వేణుబాబు, శ్రీలత, రాజేశ్వరి, రమేష్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సరిత బాయ్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ జైత్రయాత్ర



అక్షరదర్బార్, హనుమకొండ: సైబారబాద్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం ప్రారంభమైన రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు రెండవ రోజు బుధవారం తమ జైత్ర యాత్రను కొనసాగించారు. ఈ క్రీడల్లో ఇప్పటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారులు మొత్తం 33 పతకాలను సాధించగా ఇందులో 6 స్వర్ణ పతకాలు, రంజిత పతకాలు 14, కాంస్య పతకాలు 13 వున్నాయి. ఇప్పటి వరకు సాధించిన పతకాల్లో అర్చరీ క్రీడల్లో మూడు విభాగాల్లో మొత్తం 9 పతకాలను సాధించగా ఇందులో ఎస్ఐ గైక్వాడ్ అనిల్ కుమార్ మూడు స్వర్ణ పతకాలు, కానిస్టేబుల్ పి చలపతి మూడు రజిత పతకాలను గెలుచుకోగా, మరో ఆర్చరీ క్రీడాకారుడు ఎల్ రాహుల్ మూడు కాంస్యం పతాకాలను గెలుచుకున్నారు. కరాటే క్రీడలో సీసీఎస్ కానిస్టేబుల్ నరసింహ ఒక స్వర్ణం పతకంతో పాటు, రజితం, కాంస్య పతకాలను గెలుచుకున్నాడు, జూడో క్రీడలో ఏఆర్ఎస్ఐ రవి, కానిస్టేబుళ్ళ రవి, కొండ నవీన్, చంద్రశేఖర్, హరీష్‌లు నాలుగు రజిత పతకాలను గెలుచుకోగా, స్విమ్మింగ్ క్రీడలో మహిళా ఎస్ఐ సాయి దివ్య కాంస్య పతాకాన్ని సాధించింది. అథ్లెటిక్స్ విభాగంలో 4 400 రిలే పరుగులో మహిళలు రజిత పతకం గెలుపుపొందగా, పురుషుల విభాగంలో కాంస్య పతాకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందనలు తెలిపారు.

## ఘనంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ వేడుకలు

నాలుగవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ సోర్ట్స్ ` 2026 క్రీడలకు సంబంధించి సైబరాబాద్ కమిషనరేట్ పరేడ్ మైదానం నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలకు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ క్రీడలను ప్రారంభించారు.

## 12 చోట్ల ఆర్డీఎక్స్ బాంబులు పేల్చేస్తాం

- శ్రీలంక తరహాలో ఆత్మాహుతికి పాల్పడతాం..
- తెలుగు రాష్ట్రాల్లోని కోర్టులకు బాంబు బెదిరింపులు
- ఈమెయిల్ ద్వారా సందేశం పంపిన దుండగులు
- కోర్టుల నుంచి భయంతో జడ్జీలు, అడ్వొకేట్ల పరుగులు

అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుతో పాటు కరీంనగర్, రాజమండ్రి కోర్టులను పేల్చేస్తామంటూ వచ్చిన ఈ-మెయిల్స్ బుధవారం తీవ్ర కలకలం రేపాయి. కోర్టు ఆవరణల్లో 12 చోట్ల ఆర్డీఎక్స్ బాంబులు అమర్చామని గుర్తుతెలియని వ్యక్తులు హెచ్చరించారు. మధ్యాహ్నం 12.05 గంటలకు ఇవి పేలుతాయన్న సమాచారంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కోర్టు ప్రాంగణాలను ఖాళీ చేయించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ బెదిరింపు మెయిల్‌లో ఉన్న అంశాలు పోలీసులను విస్తుపోయేలా చేశాయి. తమిళనాడు పోలీసుల పేరుతో వచ్చిన ఈ మెయిల్‌లో అక్కడి సిబ్బంది పడుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఉన్నతాధికారుల ఇళ్లలో మురికి పాత్రలు కడగడం, బట్టలు ఉతకడం వంటి పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసమే ఈ చర్యకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. 1979 పోలీస్ యూనియన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ బాంబులు పేలకపోతే శ్రీలంక ఈస్టర్ ఆపరేషన్ తరహాలో ఆత్మాహుతి దాడులకు పాల్పడతామని ఆగంతకులు హెచ్చరించారు. ఈ సమాచారంతో అప్రమత్తమైన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కోర్టుల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. గంటల తరబడి గాలించిన తర్వాత ఎక్కడా పేలుడు పదార్థాలు లభించలేదు. ఇవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని పోలీసులు నిర్ధారించారు. ప్రస్తుతం సైబర్ క్రైమ్ పోలీసులు ఈ మెయిల్ మూలాలను కనిపెట్టే పనిలో ఉన్నారు.

# 21 వరకు విగ్రహ పునః ప్రతిష్ఠ

- 26 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు
- 21న కొడవటంచకు చిన్న జీయర్ స్వామి, స్పీకర్, మంత్రుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి అధికారుల సమీక్షా సమావేశం



అక్షరదర్బార్, రేగొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు, విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం రేగొండ మండలం కొడవటంచలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 18 నుంచి 21 వరకు విగ్రహ పునః ప్రతిష్ఠ, ఈనెల 26 నుంచి మార్చి 5 వరకు జాతర బ్రహ్మోత్సవాలు,, రూ.12 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 21న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారు కొడవటంచకు విచ్చేస్తున్నారని తెలిపారు. వారితో పాటు శాసనసభ స్పీకర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర వీఐపీలు స్వామి వారిని దర్శించుకోనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

### - అధికారులకు ఎమ్మెల్యే సూచనలు

తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుతో పాటు పొరుగు జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. ఆలయ ఆవరణలో మెడికల్ క్యాంపులు, అత్యవసర సమయాల కోసం అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలి. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలి. ప్రధాన రహదారుల వెంబడి ముళ్ళ పొదలను తొలగించాలి. వీఐపీలు, ప్రైవేట్ వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు, భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

### - అంకితభావంతో పనిచేయాలి: కలెక్టర్

ఆలయ పునర్నిర్మాణం, జాతర బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో



ఉండాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

### - పటిష్ఠ బందోబ : ఎస్పీ సంకీర్త్

జాతర, పునః ప్రతిష్ఠ కార్యక్రమాలకు పోలీసు శాఖ తరపున పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సంకీర్త్ తెలిపారు. ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అలసత్వం వహిస్తే చర్యలు

### - అదనపు కలెక్టర్ ఎన్ రవి



అక్షరదర్బార్, కమలాపూర్: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి కమలాపూర్ లోని బఫర్ గోదాంను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్స్ కి వెళ్లే రైస్ లో అక్కడక్కడ బ్రోకెన్ రైస్ వస్తున్నాయని, వీటిపై కంప్లైంట్ వస్తున్నందున ఇలాంటి కంప్లైంట్ మళ్ళీ రాకుండా చూసుకోవాలని అన్నారు. గోదాం నిర్వహణ, ఉద్యోగుల పని తీరు గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఎలాంటి కంప్లైంట్స్ రాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజా పంపిణీ విధానం, అంగన్ వాడి కేంద్రాలకు, హాస్టళ్లకు సరఫరా అయ్యే బియ్యం కాబట్టి సక్రమంగా నిర్వహిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ఏమైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, తహసీల్దార్ సురేష్ కుమార్, సివిల్ సప్లై డీటీ వేణుగోపాల్ , సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ రోడ్ దగ్గర బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనాలపై ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు భూపాలపల్లి పోలీసులు తెలిపారు. మృతి చెందిన వారిలో గణపురం మండల మండల కేంద్రానికి చెందిన రెబ్బ శ్రీకాంత్ ఇంకొకరు నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గాదె మహేష్ నువ్వు పోలీసులు తెలిపారు రోడ్డు ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే భూపాలపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మృతుల కుటుంబ సభ్యులకు,బంధువులకు సమాచారం అందించి వారితో పిటిషన్ తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందనీ భూపాలపల్లి పోలీసులు తెలిపారు.

# పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### ఎస్ఎస్ సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలపై జిల్లా కలెక్టర్



అక్షరదర్బార్, హనుమకొండ: పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణ అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరీక్షా సమయానికి ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. పరీక్షా సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 52 సెంటర్లలో మొదటి సంవత్సరం విద్యార్థులు 18,590 మంది పరీక్షలు రాయడం జరుగుతుందని, 20004 మంది విద్యార్థులు రెండవ సంవత్సరం పరీక్షలు రాయడం జరుగుతుందని పేర్కొన్నారు. అందుకుగాను పరీక్షా కేంద్రాల్లో శానిటేషన్,, త్రాగునీరు,తదితర సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రతి సెంటర్లో రెండు నుంచి మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సెల్ ఫోన్లు అనుమతించబడవని అంతేకాకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష సమయానికి ముందు కస్టోడియన్ అధికారులు పోలీసు వారి సహకారంతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్న పత్రాలు పంపడం జరుగుతుందని అన్నారు. మార్చి 14 నుండి నిర్వహించే ఎస్ ఎస్ సీ వార్షిక పరీక్షలకు జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు జరిగిందని, 12 079 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలు మౌలిక వసతులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915